క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల హెచ్‌టీ లైన్లపై నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ నెల 2న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అబిద్‌నగర్, షాదీఖానా, రామచంద్రనగర్, ముస్లిం తాటిచెట్లపాలెం, బైబిల్ హౌస్, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, అప్పర్ జయప్రకాష్ నగర్, బాబూజీ నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, కొత్తూరు, ఇందిరానగర్ 1–5 ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

పద్య కవయిత్రి కన్నేపల్లి మృతికి సంతాపం



కన్నేపల్లి వరలక్ష్మి (ఫైల్)

సీతంపేట: నగరానికి చెందిన పద్య కవయిత్రి కన్నేపల్లి వరలక్ష్మి క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చెన్నైలో మరణించారు. ఆమె సెయింట్ జోసఫ్ సెకండరీ పాఠశాలలో గ్రేడ్–1 తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. 15 వరకు పద్య కావ్యాలు రచించారు. చందస్సులో ఎన్నో ప్రయోగాలు చేసి సాహితీ స్రోతస్విని బిరుదు పొందారు. ఈమె వయసు 75 ఏళ్లు. భర్త టీచర్‌గా పనిచేస్తూ కాలం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె. విశాఖ చరిత్రలో కన్నేపల్లి వరలక్ష్మి నాలుగో పద్య కవయిత్రి అని, ఈమె మరణం సాహితీ ప్రపంచానికి తీరని లోటని రచయిత డి.వి.సూర్యారావు సంతాపం తెలిపారు. విశాఖ సాహితి సభ్యులు, నగరంలోని సాహితీ ప్రముఖులు వరలక్ష్మి మరణంపై బుధవారం సంతాపం ప్రకటించారు.

అబిద్‌నగర్ పార్కులో వాష్‌రూమ్స్ ప్రారంభం



వాష్‌రూమ్స్ ప్రారంభిస్తున్న కిషోర్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అబిద్‌నగర్ పార్కులో కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ప్రోత్సాహంతో వాష్‌రూమ్స్ నిర్మించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్మించిన ఈ మరుగుదొడ్లను బుధవారం అబిద్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు యు.కిషోర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జె.ఖాన్, ఎస్.వి.ఆర్.ప్రసాద్, వెంకటరావు, అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణం



బీఎస్ లేఅవుట్‌లో జరుగుతున్న రోడ్డు పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బీఎస్ లేఅవుట్‌లో రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభయాంజనేయ స్వామి ఆర్చ్ నుంచి పనులు ప్రారంభించారు. గతంలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో వాటిని పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.20 లక్షలతో గతంలో నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పూర్తి చేసి రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఎక్కడి చెత్త అక్కడే..

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా వార్డులోని వివేకానంద పార్కు ప్రాంతంలో ఎక్కడ చూస్తే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. రహదారులపై పేరుకుపోయిన చెత్త వల్ల దోమలు వృద్ధి చెంది, రోగాల బారిన పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇటువైపుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



24వ వార్డు వివేకానంద పార్కు రహదారిలో చెత్త పోగులు

సీజీఎం రామకృష్ణ సేవలు ప్రశంసనీయం

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ హెచ్‌ఆర్డీ, సీజీఎంగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎం.రామకృష్ణను బుధవారం గురుద్వారా దరి కార్పొరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సంస్థ ఫైనాన్స్ అండ్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ డి.చంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ 35 ఏళ్ల పాటు అంకితభావం, నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు. హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో సమర్థవంతంగా పనిచేశారన్నారు. సంస్థ సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ రెడ్డి, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు, ఎస్.వి.రమణమూర్తి, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీజీఎం రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం

కేంద్రం నిర్లక్ష్యంతోనే రైలు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే రైలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన రైలు ప్రమాదంపై ఆయన స్పందించారు. 10 ఏళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరిగా స్పందించడం లేదన్నారు. సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం వంటివి చేయడం లేదని, ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. రైల్వేలో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోవడం, సిబ్బంది సమస్య వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో హడావుడి చేస్తున్నారే గానీ.. సాధారణ, మధ్యతరగతి రైళ్లపై, ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తరచూ జరుగుతున్న రైలు ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎంపీలు ప్రశ్నిస్తున్నా.. దేశ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా.. స్పందించని రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాలని రాజు డిమాండ్ చేశారు.

3న తుపాకీ సంస్కృతిపై సదస్సు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా హెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై ఈ నెల 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రపంచ శాంతిని కోరే మేధావులు సామాజిక కార్యకర్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి, అబ్దుల్ మునీర్, ముషాద్ పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

వృద్ధురాలి అదృశ్యం



పూడి గంగమ్మ

సీతమ్మధార: సీతమ్మధారలో నివసిస్తున్న పూడి గంగమ్మ అనే వృద్ధురాలు శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు 95733 22882 నంబర్‌కు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

సింహాద్రప్పడు విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

మురళీనగర్: ఉపాధ్యాయ ఉద్యమ సింహం, సామాజిక సేవకుడు దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు విగ్రహాన్ని మురళీనగర్‌లో ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఏపీటీఎఫ్ నాయకులు మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా వీరు బీజేపీ శాసనసభా పక్షనేతగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన సింహాద్రప్పడు విగ్రహాన్ని మురళీనగర్‌లో ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ నుంచి అనుమతి ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.కరుణాకరరావు, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బి.ముత్యాలనాయుడు, రాష్ట్ర భాషా పండితుల సంఘం కార్యదర్శి సనపల ఉమాపతి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రెండు కిలోల గంజాయి స్వాధీనం

- రిమాండ్‌కు ముగ్గురు నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఫోర్త్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్‌లోని ధారకొండపై గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడులు చేశారు. గొల్లలపాలేనికి చెందిన వానం నవీన్, అవాల అశోక్‌కుమార్, నక్కవానిపాలేనికి చెందిన నక్కల కార్తీక్‌ల వద్ద నుంచి రెండు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హౌసింగ్ కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించండి

సీతమ్మధార: బక్కన్నపాలెం హుద్‌హుద్ హౌసింగ్ కాలనీలో విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నామని నివాసులు వాపోయారు. తమ కాలనీకి విద్యుత్ సరఫరా సదుపాయం కల్పించాలని కోరుతూ బుధవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తక్షణం విద్యుత్ సరఫరా అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ హుద్‌హుద్ బాధితుల కోసం బక్కన్నపాలెంలో 320 కుటుంబాలకు నూతనంగా ఇళ్లు నిర్మించారన్నారు. అందులో 151 కుటుంబాలను గుర్తించి వెరిఫికేషన్ చేసి డ్రా తీసి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ హౌసింగ్ కాలనీలో విద్యుత్ సదుపాయం లేక ఇళ్లలోకి పాములు, విషపురుగులు రావడంతో పిల్లలతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. వెంటనే విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కె.చిన్నా, సరోజిని, అనురాధ, బోగేష్, శ్రీను, రాజు, కాలనీ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బక్కన్నపాలెం హౌసింగ్ కాలనీవాసులు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జీవీఎంసీ వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో డెంగ్యూ, ఫైలేరియా, మలేరియా వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణ మార్గాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించడంతోపాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యాధుల లక్షణాలు కనిపించగానే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ కె.కీర్తిపట్నాయక్, శానిటరీ సూపర్‌వైజర్ పి.జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో గణపతి పూజ అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం జరిగింది. తదుపరి భక్తులు స్వహస్తాలతో అమ్మవారి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. సాయంత్రం కూడా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి మరోసారి జలాభిషేకం చేశారు. ఆలయ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జర్నలిస్టుల వినతి

మహారాణిపేట: విశాఖ జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బుధవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. గతేడాది మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియం సీఎస్ఆర్ కింద చెల్లింపునకు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, ధవళేశ్వరపు రవికుమార్ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ దేశాభివృద్ధికి ఆటంకం

ఎంవీపీ కాలనీ: బాల కార్మిక వ్యవస్థ అనేది ఏ దేశం సమ్మిళిత అభివృద్ధికైనా ఆటంకం కలిగించే అంశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్ అంశంపై జర్నలిజం విభాగం సమావేశ మందిరంలో బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, సామాజిక వెనుకబాటు తనంతో పాటు అనేక అంశాలు చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్‌కు దారితీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ వంటి సంస్థలు, ఎన్జీవోలు ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు అన్వేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత, సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ డైరెక్టర్ ఆచార్య సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: చేసిన అప్పులు తీర్చలేనన్న బాధతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ గ్లోరియా స్కూల్‌కు సమీపంలో తగరంపూడి వెంకట సత్య భాస్కర రావు (50) భార్య రత్నకుమారి, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నారు. భాస్కరరావు సమీపంలోని డెయిరీ ఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ అందినచోటల్లా అప్పులు చేశాడు. సుమారు రూ.75లక్షల వరకు అప్పులు చేయడం, తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో మానసిక ఆందోళనకు గురై కొద్దిరోజుల పాటు భీమవరం వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం నుంచి తిరిగి వచ్చిన భాస్కరరావు బాత్‌రూమ్‌లోకి వెళ్లి పురుగుల మందు సేవించాడు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాత్‌రూమ్ నుంచి వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయిన భాస్కరరావును భార్య రత్నకుమారి చుట్టు పక్కల వారి సహాయంతో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.



సత్యవెంకట భాస్కరరావు మృతదేహం

సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయి

మహారాణిపేట: గడిచిన ఏడాదిలో సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ద శివాజీ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో సర్వసభ్య సమావేశాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రయం పొందుతున్న బాల బాలికలను ఉన్నత విద్యావంతులను చేయడమే లక్ష్యమన్నారు. శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించడమే కాకుండా ఆనందంగా ఉండాలన్నారు. ప్రేమ సమాజం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, సభ్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శి కె.హరిమోహన్‌రావు ప్రేమ సమాజంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నివేదిక వెల్లడించారు. కోశాధికారి ఎంవీవీకే గుప్త ఆదాయ వ్యయాలను వెల్లడించగా సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులు వి.మోహన్‌రావు, వి.కె.సురేష్ కుమార్, సలహాదారు డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు, పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులు, జీవిత కాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలగించి సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభిస్తున్న శివాజీ

చిన్నారులు ఆడుకునేదెక్కడ?

- తీరం వెంబడి పార్కుల్లో పాడైన ఆట పరికరాలు
- మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు

బీచ్ రోడ్డు: విశాఖ సాగర తీరం వెంబడి ఉన్న పార్కుల్లోని చిన్నారుల ఆట పరికరాలు పాడైమూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేపట్టే నాథుడు కరువయ్యారు. ఫలితంగా నిత్యం చిన్నారుల ఆట పాటలతో కళకళలాడే ఆ పార్కులు ఇప్పుడు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. సందర్శకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి పార్కులను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. ముఖ్యంగా చిన్నారుల ఆడుకోవడం కోసం కోస్టల్ బాటరీ నుంచి వైఎంసీఏ వరకు పలు పార్కులను ఆట పరికరాలతో తీర్చిదిద్దింది. తీరానికి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పార్కుల్లో ఆటలాడిస్తూ సముద్రాన్ని చూస్తూ సేద తీరేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కుల్లో ఉన్న ఆట పరికరాలు పూర్తిగా శిథిలమైపోయాయి. దీంతో సందర్శకులు నేరుగా తీరంలో కాసేపు సేదతీరి ఇంటికి వెళ్లిపోతున్నారు.

కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు గోకుల్ పార్క్, చిల్డ్రన్ పార్క్, ఎబిలిటీ పార్క్‌ను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. వీటిలో గోకుల్ పార్క్‌లో ఆట పరికరాలు పూర్తిగా పాడైపోయాయి. చిల్డ్రన్ పార్కు చాలా అధ్వానంగా తయారైంది. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ఎబిలిటి పార్క్‌లో చిన్నారులకు ఇష్టమైన ఆట పరికరాలు చాలా తక్కువగా ఉన్నాయి. తీరం వెంబడి ఉన్న పార్కుల్లోని ఆట పరికరాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి చిన్నారులకు ఆహ్లాదం అందించాలని నగరవాసులు కోరుతున్నారు.



గోకుల్ పార్క్‌లో పాడైన ఆట పరికరాలు





చిల్డ్రన్ పార్క్‌లోని ఊయల దుస్థితి

ఎప్పటి చెత్తను అప్పుడే తరలించాలి

జగదాంబ: యార్డులో చెత్తను ఏ రోజుకు ఆ రోజు కాపులుప్పాడ తరలించి యార్డును జీరో చేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును, క్లోజ్ కాంపెక్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్–3, 4, 5 ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తను వెంటనే యార్డుకు తరలించాలన్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడకు పంపిచాలన్నారు. క్లోజ్ కాంపెక్ట్ వాహనాల్లో సామర్థ్యం మేర పంపించాలన్నారు. తక్కువగా పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా రోడ్డుపైన డెబ్రిస్, సిల్ట్, ఇసుక ఉండకూడదన్నారు. వాటిని కూడా జీవీఎంసీ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ముఖ్యంగా యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తకు ప్లాస్టిక్ కవర్లు చుట్టాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణరాజు, మెకానికల్ ఈఈ దిలీప్, ఇంజినీరింగ్ ఈఈ సంతోష్‌కుమారి, ఏఈ జాన్సన్, ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

హెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర మహిళా విభాగం నియామకం

విశాఖ విద్య: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా(హెచ్‌ఆర్‌సీఐ) రాష్ట్ర మహిళా విభాగం(ఉమెన్ పోర్ట్స్)ను నియమించినట్లు కౌన్సిల్ జాతీయ కన్వీనర్ ఆల్ఫా కృష్ణ వెల్లడించారు. ఎన్ఏడీలోని కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పి.శ్రీదేవివర్మ, ప్రధాన కార్యదర్శిగా సోలాపురపు పద్మరాణి నియామకమయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా మునగపాక సత్యవతి, కొల్లి రమణమ్మ, వివిధ విభాగాలకు కాళ్ల మణిప్రసాద్, కరకవలస సంతోష్‌లను ఎంపిక చేశారు. వీరందరికీ ఆల్ఫా కృష్ణ నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. నూతన కమిటీతో మానవ హక్కులు, మహిళా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.